సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 11 । జూన్ । 2024



స్విమ్మింగ్.. అదుర్స్

సంగారెడ్డి జిల్లా యువజన క్రీడల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ పిల్లలతో కళకళలాడుతోంది. వివరాలు 8లో ▸



పల్లెల్లో ఎలక్ట్రిక్ బైక్‌ల జోరు

ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగం పెరిగిపోతుంది. పట్టణాల నుంచి పల్లెల వరకు వీటిని వినియోగిస్తున్నారు. వివరాలు 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

కల్హేర్(నారాయణఖేడ్) : నిజాంపేట మండలం బాచేపల్లిలోని గిరిజన బాలికల మినీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ శామలదేవి తెలిపారు. 1వ తరగతిలో 30, 5వ తరగతిలో 22 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8106803922 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు జిల్లా వ్యవసాయ అధికారితో ఫోన్‌ఇన్

సంగారెడ్డి : వానాకాలం సాగుపై 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనుంది. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగులో పాటించాల్సిన మెలకువలు, విత్తనాలు, సేంద్రియ, రసాయన ఎరువుల వాడకంపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంబికా సోని కి నేరుగా ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





తేదీ : 12-06-2024

సమయం : ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
7288894403, 9908322511

విత్తన చేపకు ప్రత్యామ్నాయం

మంజీరా డ్యాం వద్ద చేప పిల్లల ఉత్పత్తి
- ఉత్పత్తి కేంద్రంలో కార్యాచరణను ప్రారంభించిన మత్స్యశాఖ
- సుమారు 64 లక్షలు ఉత్పత్తి చేయాలని లక్ష్యం!

విత్తన చేప పిల్లల కొనుగోలుపై స్పష్టత లేకపోవడంతో మత్స్యశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ఆ శాఖ ఉత్పత్తి కేంద్రాల్లో విత్తన చేప పిల్లలను పెంచేందుకు కార్యచరణ చేపట్టాలని భావిస్తోంది. ఈ ఏడాది విత్తన చేప పిల్లల కొనుగోలుపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో విత్తన చేపపిల్లలను సొంతంగా ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :

మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని గత ప్రభుత్వ హయాంలో కొనసాగింది. చేపపిల్లలను కొనుగోలు చేసి జిల్లాలో ఉన్న చెరువుల్లో వదిలేది. వర్షాలు కురిసిన వెంటనే మూడో వంతు నీళ్లు నిండిన చెరువుల్లో విత్తన చేప పిల్లలను వదిలేవారు. ఆ పిల్లలు పెద్దవికాగానే పట్టుకుని ఆయా చెరువులే ఆధారంగా జీవనం కొనసాగిస్తున్న మత్స్యకారులు ఉపాధి పొందడం అనేది పథకం లక్ష్యం. ఈ విత్తన చేప పిల్లలను ఆంధ్రా ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ల వద్ద కొనుగోలు చేసే వారు. ఇందుకోసం టెండరు ప్రక్రియను నిర్వహించి ధరలను ఖరారు చేసే వారు. అయితే ఈసారి ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఈ టెండరు ప్రక్రియ చేపట్టడం వీలు కాలేదు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వారం రోజుల క్రితం వరకు కోడ్ అమలులో ఉంది. దీంతో ఈ విత్తన చేప పిల్లల కొనుగోలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోయింది. మరో వైపు రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వం ఈ పథకంపై ఇంకా పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకోలేదు. దీంతో మత్స్యశాఖ అధికారులు విత్తన చేపపిల్లల కోసం ప్రత్యామ్నాయంగా తమ ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి చేసేందుకు సన్నాహలు చేస్తోంది.

మంజీరా డ్యాం వద్ద కేంద్రంలో..

మత్స్యశాఖకు మంజీరా డ్యాం వద్ద విత్తన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఉంది. సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో ఉన్న ఈ కేంద్రం ఉత్పత్తి సామర్థ్యం 64 లక్షలు. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఉత్పత్తి చేయడానికి సీజన్ ఉంటుంది. 30 ఎంఎం సైజుల్లో ఉండే ఈ విత్తన చేపపిల్లలను ఉత్పత్తి చేసేందుకు మూడు నెలల సమయం పడుతుంది. 90 రోజుల్లో రెండు విడతల్లో ఉత్పత్తి చేస్తారు. ఒక్కో విడతలో 32 లక్షల చొప్పున ఉత్పత్తికి సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే గత ఏడాది ప్రభుత్వం విత్తన చేప పిల్లలను కొనుగోలు చేయడంతో ఇక్కడ కేవలం 21 లక్షల విత్తన చేప పిల్లలను మాత్రమే ఉత్పత్తి చేయగలిగారు. కానీ ఈసారి వీటి కొనుగోలు లేకపోవడంతో ఈ కేంద్రం గరిష్ట సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా రవూ, బొచ్చ, బంగారుతీగ రకాల విత్తన చేప పిల్లలను ఉత్పత్తి చేయాలని భావిస్తున్నామని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ 'సాక్షి'తో పేర్కొన్నారు.

కొనుగోళ్లలో భారీ అక్రమాలు

జిల్లాలో ఏటా సుమారు 3.5 కోట్ల విత్తన చేపపిల్లలను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ కొనుగోలు ప్రక్రియలో ఏటా అక్రమాలు పరిపాటిగా మారాయి. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఏటా సగం సంఖ్యలో చేప పిల్లలను కూడా వదిలేవారు కాదు. బిల్లులు మాత్రం పూర్తి స్థాయిలో డ్రా చేయడం ఏటా పరిపాటిగా జరిగింది. ఈ వ్యవహారంలో రూ.లక్షల్లో ముడుపులు చేతులు మారాయి. అయితే ఈ పథకం పూర్తిగా అక్రమాలకు నిలయంగా మారడంతో ఈ ప్రభుత్వం ఈ ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

అర్జీలు త్వరగా పరిష్కరించండి

కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి టౌన్ : లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని పునరుద్ధరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లా అధికారులు తమ శాఖకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలపై 49 అర్జీలు వచ్చాయని తెలిపారు. అలాగే అధికారులు అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. బడులకు యూనిఫాంలు, పుస్తకాలు త్వరగా అందజేయాలన్నారు. మరో కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఆదేశించారు.

- అక్రమ మైనింగ్ ఆపాలంటూ హత్నూర మండలానికి చెందిన గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మైనింగ్ వలన పంట పొలాలు, బోర్లు, బావులు ధ్వంసం అవుతున్నాయని తెలిపారు.
- అందోల్ చెరువు కట్టపై అక్రమ నిర్మాణాలను ఆపాలని మున్సిపాలిటీ 9వ వార్డు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని చెప్పారు.
- స్లాట్ బుకింగ్ రద్దు చేయాలని రాయికోడ్ మండలానికి చెందిన శోభారాణి ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా ధరణి పోర్టల్‌లో స్లాట్ బుకింగ్ చేశారని, వారి పై చర్యలు తీసుకోవాలన్నారు.
- కోహీర్ మండలం బడంపేటకు చెందిన బేగరి నర్సింలు మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత సామాజిక సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు : ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ముత్తంగి గ్రామ పరిధిలోని డీఎస్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధి పనుల్లో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం పెరగాలని కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి గ్లాండ్ ఫార్మా పరిశ్రమ అందిస్తున్న సహకారం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, వైస్ ఎంపీపీ స్వప్న, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కుమార్ గౌడ్, గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ రఘురామన్, ఎంఈఓ పీపీ రాథోడ్, దయానంద్ పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న ఏజీ, అధికారులు, న్యాయవాదులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ది ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటుకు అధికారులు, న్యాయవాదులు సోమవారం పలు భవనాలను పరిశీలించారు. పాత ప్రభుత్వ పాఠశాల భవనం, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఐకేపీ, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన భవనాలను జిల్లా కోర్టు ఏఓ శ్యామల, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీపీ రవీందర్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు పరిశీలించారు. వీటిలో ఐకేపీ భవనం కోర్టు ఏర్పాటుకు అనువుగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంజిరెడ్డి, శ్రీనివాస్, మధుశ్రీ, స్వరూపారాణి, ప్రకాశ్, నారాయణ, నాయకులు రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమతత్వంతో వ్యవహరించాలి



పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతీ

నారాయణఖేడ్: ప్రేమ తత్వంతో వ్యవహరిస్తే ప్రతీ ఒక్కరిలో పరమాత్మ కనిపిస్తాడని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ అన్నారు. పట్టణ శివారులోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకల్లో సోమవారం పాల్గొని మాట్లాడారు. ఆలయ వ్యవస్థాపకులు చిన్ని మధుకర్ కుటుంబ సభ్యులు స్వామికి పాద పూజ నిర్వహించారు. స్థానిక వేద పండితులు గురురాజ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

కూలీలకు పునరావాసం కల్పించండి



వినతి పత్రం ఇస్తున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: కూలీలకు పునరావాసం కల్పించిన తర్వాతే నిమ్జ్ కోసం భూములు స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్ డిమాండ్ చేశారు. ఎల్గోయి, ముంగి తండా, ముంగి గ్రామాలకు చెందిన కూలీలతో కలిసి సోమవారం నిమ్జ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా భూములను తీసుకుంటుందని ఆరోపించారు. 2013 చట్టం ప్రకారం కూలీలకు పునరావాసం కల్పించాలని, ఈ మేరకు 2016లో హైకోర్టు ఆదేశాలు కూడా జారీ చేసిందన్నారు. ఆదేశాలను బేఖాతరు చేయడం సమంజసం కాదన్నారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శంకర్, సంజీవులు, పాండు, నర్సింలు, సుజాత, రేకమ్మ పాల్గొన్నారు.

మేము సైతం..



మోదుగు ఆకులతో చేసిన విస్తార్లను చూపుతున్న ఉపాధి కూలీలు

పర్యావరణ పరిరక్షణలో తమవంతు పాత్ర పోషిస్తామని చేర్యాల మండల పరిధిలోని చిట్యాల గ్రామ ఉపాధి హామీ కూలీలు ప్రతినబూనారు. తాము పనిచేసే చోట మోదుగు ఆకులతో తయారు చేసిన విస్తరాకుల్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో మోదుగు ఆకుల విస్తార్లు వినియోగించామని చెప్పారు. – చేర్యాల(సిద్దిపేట)

ఆ అమాత్యులపైనే ఆశలన్నీ..

- కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బండి, పొన్నం
- రాజకీయ విభేదాలు వీడాలి.. అభివృద్ధిలో పోటీపడాలి
- హుస్నాబాద్ ప్రాంత ప్రజల ఆకాంక్ష



బండి సంజయ్, కేంద్ర మంత్రి



పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రి

హుస్నాబాద్: పోరాటాల గడ్డ హుస్నాబాద్‌కు ఇద్దరు మంత్రులు వచ్చారు. ఒకరు హుస్నాబాద్ ఎమ్మెల్యే, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరొకరు కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్. వీరిద్దరి స్వగ్రామం కరీంనగర్ పట్టణం కావడం విశేషం. ఎన్నికల ముందు వీరిద్దరు పరస్పర విమర్శలతో రాజకీయ వేడిని పుట్టించారు. సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకున్నారు. అయితే.. ఎన్నికలు ముగిశాయి. ఇద్దరికి అదృష్టం వరించింది. ఇద్దరూ మంత్రులయ్యారు. ఇప్పుడు ప్రజల దృష్టి అంతా ఈ ఇద్దరు మంత్రులపైనే. ఇక కావాల్సింది అభివృద్ధి మాత్రమే. రాజకీయ విభేదాలు పక్కనబెట్టి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడంలో పోటీపడాలని ఆశిస్తున్నారు. కేంద్రమంత్రి బండిసంజయ్‌పై హుస్నాబాద్ ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. 2019 ఎన్నికల్లోనే హుస్నాబాద్‌లో రైలుకూత వినిపిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో జాతీయ రహదారి పనులు వేగంగా నడుస్తున్నాయి. రహదారి పూర్తయితే పారిశ్రామికంగా, వ్యాపార పరంగా ఈ ప్రాంత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. యువతకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. కరీంనగర్ నుంచి హుస్నాబాద్ మీదుగా జనగామ, యాదాద్రి వరకు జాతీయ రహదారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కేంద్ర విద్యాసంస్థలైన నవోదయ, సైనిక్ స్కూళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీగా గెలవడమే కాకుండా ఏకంగా కేంద్ర మంత్రి పదవిని పొందిన బండి సంజయ్ ఏ మేరకు ప్రగతిని పరుగులు పెట్టిస్తారో వేచిచూడాల్సిందే.

హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాల

పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ హామీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అయితే.. ఆయన ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా మంత్రి అయ్యారు. హామీల అమలుపై దృష్టి సారించారు. ఈ క్రమంలో పలుచోట్ల మెడికల్ కళాశాల కోసం స్థల పరిశీలన చేశారు. మెడికల్ కళాశాల ఏర్పాటు కావాలంటే హుస్నాబాద్‌లో 250 పడకల ఆస్పత్రి ఉండాలి. పట్టణంలో 100 పడకల ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కసరత్తును ప్రారంభించారు. అలాగే హుస్నాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు సమాచారం. హుస్నాబాద్ శివారు నుంచి రింగ్ రోడ్డు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సైతం రూపుదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు మంత్రుల్లో అభివృద్ధిపై దృష్టి సారిస్తారని ఈ ప్రాంత ప్రజలు కోటిఆశలతో ఎదురుచూస్తున్నారు.

13న జాబ్‌మేళా

సంగారెడ్డి టౌన్ : జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌పీసీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చేసిన విద్యార్థులకు 72ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగలవారు సర్టిఫికెట్లతో కార్యాలయంలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 08455 271010 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సబ్సిడీపై సోయా విత్తనాలు

జహీరాబాద్ టౌన్: డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైతు సేవా కేంద్రం ద్వారా సబ్సిడీపై సోయా విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ సోమవారం తెలిపారు. 25 కిలోల సోయా విత్తనాల బస్తా రూ. 2,750 ఉండగా సబ్సిడీపై రూ.2 వేలకు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యతో వ్యాపారం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్ : విద్యతో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, విజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ పీపీ రాథోడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ బడుల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని నిబంధన ఉన్నా బేఖాతరు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘం నాయకులు విజేందర్, బంటి యాదవ్, దత్తు, ఇషాన్ సింగ్, శివ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్ : డొనేషన్లు, ఫీజుల పేరిట ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా దోచేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని చూస్తూ కూడా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. డ్రెస్సులు, బుక్స్, స్టేషనరీ అమ్ముతూ పేదల జేబులు గుల్ల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సురేష్, మూర్తి పాల్గొన్నారు.

పారిశ్రామిక పరుగులు

- నెలకొల్పేందుకు యాజమాన్యాల ఆసక్తి
- విరివిగా భూముల కేటాయింపు
- టీఎస్‌ఐఐసీకి ఇప్పటికే 257 ఎకరాలు అప్పగింత
- కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం
- యువతకు పెరగనున్న ఉపాధి అవకాశాలు

జిన్నారం మండల వ్యాప్తంగా పరిశ్రమలు



జిన్నారంలో పరిశ్రమలకు కేటాయించిన స్థలం ఇదే

జిన్నారం(పటాన్‌చెరు): కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఇందుకోసం ఇండస్ట్రీల ఏర్పాటుకు ముందుకు వస్తున్న యాజమాన్యాలను ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా పరిశ్రమల నిర్మాణానికి అనుమతులు ఇస్తూ భూములు కేటాయిస్తుంది. ఔటర్ రింగురోడ్డు బయట పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో సర్కార్ అడుగులు వేస్తుంది. దీంతో రింగురోడ్డుకు సమీపంలో గల గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించి, కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పెద్దపీట వేస్తుంది. పరిశ్రమల ఏర్పాటు జరిగితే ఉపాధి లభిస్తుందని యువత ఆశగా ఎదురు చూస్తుంది.

జిన్నారం మండలంలోని బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లో 240 వరకు వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 95శాతం రసాయన పరిశ్రమలే ఉన్నాయి. ఔటర్ రింగురోడ్డుకు బయట పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అయితే గ్రామాల సమీపంలో కాలుష్య రహిత పరిశ్రమలు మాత్రమే ఏర్పాటు చేయాలని చూస్తుంది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 257 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్‌ఐఐసీకి అప్పజెప్పారు. దీంతో ఈ స్థలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు యాజమాన్యాలు ముందుకు వస్తున్నారు. జిన్నారం, మంగంపేట, అల్లీనగర్, వావిలాల, శివానగర్ ప్రాంతాల్లో కొన్ని నిర్మాణాలు కూడా ప్రారంభించారు. ఇవి పూర్తయితే స్థానికంగా ఉండే యువకులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.

కేటాయింపుల వివరాలు

- మండల కేంద్రమైన జిన్నారంలోని సర్వేనంబర్ ఒకటిలో 36 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి టీఎస్‌ఐఐసీ అప్పజెప్పారు. దీనిని రెండు పరిశ్రమలకు కేటాయించారు. ఇప్పటికే ఒక పరిశ్రమకు సంబంధించిన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- వావిలాల గ్రామంలోని 190 సర్వే నంబర్‌లో 60 ఎకరాలు, 189 సర్వేనంబర్‌లో 10 ఎకరాల స్థలాన్ని అధికారులు గుర్తించగా, ఇక్కడ ఒక పరిశ్రమ నిర్మాణం వేగంగా జరుగుతుంది.
- మంగంపేట గ్రామంలోని 55 సర్వే నంబర్‌లో ఇరవై రెండు ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు టీఎస్‌ఐఐసీకి అప్పజెప్పగా, ప్రస్తుతం ఓ పరిశ్రమ యాజమాన్యం నిర్మాణ పనులు ప్రారంభించింది.
- గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని అల్లీనగర్ గ్రామంలోని 27 సర్వేనంబర్‌లో 9 ఎకరాల భూమిని ఓ పరిశ్రమకు అధికారులు కేటాయించగా, నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- శివానగర్ గ్రామంలోని 114 సర్వే నంబర్‌లో 120 ఎకరాల స్థలాన్ని టీఎస్‌ఐఐసీ అప్పగించగా.. దీనిని ఎల్ఈడీ పార్కు ఏర్పాటుకు అధికారులు కేటాయించారు. ప్రస్తుతం అందులో పది వరకు పరిశ్రమలు నిర్మాణంలో ఉండగా, మరో మూడు పరిశ్రమల నిర్మాణం దాదాపు పూర్తి అయ్యాయని అధికారులు చెబుతున్నారు.

వేగంగా స్థల సేకరణ

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ స్థల సేకరణను వేగంగా చేపడుతున్నాం. తాము సేకరించిన స్థలాన్ని టీఎస్‌ఐఐసీకి అప్పజెప్తున్నాం. మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో రక్షించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.
– భిక్షపతి, జిన్నారం తహసీల్దార్

క్లుప్తంగా

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



వ్యవసాయ సహకార సంఘాన్ని పరిశీలిస్తున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఇందుకు అనుగుణంగా పీఏసీఎస్ సంఘాలు పని చేయాలని కోరారు. సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన పరిశీలించారు. పీఏసీఎస్ పరిధిలో రైతులకు అందిస్తున్న సేవలను చైర్మన్ పాండు, సంఘం కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా చర్యలు తీసుకోవడంతోపాటు, సకాలంలో ఎరువులు అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురైతే తనకు సమాచారం అందించాలని కోరారు. గత సీజన్‌లో నిర్వహించిన ధాన్యం కొనుగోలు వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజా, గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఎంపీటీసీ రాజు, మాజీ ఎంపీటీసీ రామిరెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి. సొసైటీ డైరెక్టర్లు, కార్యదర్శి ధన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు ఖేడ్ విద్యార్థులు



అవార్డులతో విద్యార్థులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో 10 జీపీఏ సాధించి ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు సాయికీర్తన, వైష్ణవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధలకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ శ్రీదేవసేన పాల్గొన్నారు. ఖేడ్ ప్రాంతం నుంచి విద్యార్థులు అవార్డులను సాధించడంపై స్థానికులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సిద్దిపేటఅర్బన్: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు మిట్టపల్లి గ్రామ శివారులో సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. నంగునూరు మండలం అక్కనపల్లి గ్రామానికి చెందిన బైరి నరేశ్, అఫీజ్ సాయి ఇద్దరూసి రెండు ట్రాక్టర్లలో సిద్దిపేటకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందింది. మిట్టపల్లి గ్రామ శివారులో కాపు కాసి ట్రాక్టర్లను పట్టుకున్నాం. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేశామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



జైపాల్

కల్హేర్(నారాయణఖేడ్): యువకుడు అదృశ్యమైన ఘటన నిజాంపేట మండలంలో చోటు చేసుకుంది. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం కథనం మేరకు.. బుగ్యానాయక్ తండాకు చెందిన కేతావత్ జైపాల్ మతస్థిమితం బాగాలేక పిచ్చిపిచ్చి గా ప్రవర్తిస్తుండేవాడు. నెల రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిన జైపాల్ తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం జైపాల్ భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుతో యువతి మృతి

రాయికోడ్ మండలంలో ఘటన

రాయికోడ్(అందోల్): పిడుగుపాటుతో యువతి మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని కోడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సోమవారం గ్రామానికి చెందిన పలువురు మహిళలు గ్రామ శివారులోని ఓ పొలంలో పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మహిళలు పొలంలో ఉండగానే పిడుగుపడటంతో గ్రామానికి చెందిన యాస్మిన్ బీ (19), ఈ.అనుషమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కూలీలు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను జహీరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా యాస్మిన్ బీ మృతి చెందింది. అనుషమ్మను మెరుగైనా వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్విమ్మింగ్.. అదుర్స్

- ఈతతో ఆనందం, ఆరోగ్యం
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు, పిల్లలు
- సంగారెడ్డిలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్
- జిల్లా యువజన క్రీడల ఆధ్వర్యంలో నిర్వహణ
- నిత్యం 500 నుంచి 600 మందితో సందడి



స్విమింగ్ పూల్‌లో ఈత కొడుతున్న పిల్లలు,పెద్దలు

సంగారెడ్డి: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో స్విమ్మింగ్ అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. సంగారెడ్డి కొత్త బస్టాండ్, రాజీవ్ పార్క్ పక్కనే ఉన్న ఈ స్విమ్మింగ్ పూల్ యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో అన్ని కాలాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో పూల్ నిత్యం కళకళలాడుతుంది. ఉదయం సాయంత్రం పిల్లలు, పెద్దలతో హౌస్ సందడిగా కనిపిస్తుంది. రోజూ 500 మంది నుంచి 600 వరకు స్విమ్మింగ్ చేయడానికి వస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

స్విమ్మింగ్‌తో ఉపయోగాలు

ప్రతీ రోజూ స్విమ్మింగ్ చేయడం వల్ల మనిషికి అన్ని అవయవాలు పని చేయడమే కాకుండా మానసిక ప్రశాంతత దొరుకుతుంది. అలాగే రక్త ప్రసరణ మెరుగై గుండెకు వ్యాయామం అవుతుంది. నిత్యం స్విమ్మింగ్ చేయడం వల్ల ఎలాంటి రోగాలు దరి చేరవని నిపుణులు సూచిస్తున్నారు.

రోజుకు ఆరు గంటలు..

ప్రతీ రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు స్విమ్మింగ్ పూల్ కొనసాగుతుంది. స్విమ్మింగ్ చేయడానికి తప్పనిసరిగా తలకు క్యాప్, కళ్లకు అద్దాలు, షాట్, మహిళలు అయితే ఫుల్ స్విమ్మింగ్ డ్రెస్ తప్పనిసరిగా ఉండాలి. లేనిచో లోపలికి ఎంట్రీ ఉండదు. 14 ఏళ్ల పిల్లలకు నెలకు రూ.800, 14 ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ.1,000 చొప్పున చెల్లించాలి. అలాగే ఒకే గంట కావాలనుకుంటే గంటకు రూ.100 చొప్పున స్విమ్మింగ్ పూల్ యాజమాన్యానికి చెల్లించాలి.

స్వచ్ఛమైన నీళ్లలో..

సిమ్మింగ్ పూల్ ప్రతిరోజూ పిల్లలతో సందడిగా కనిపిస్తుంది. ఉదయం 3 గంటలు, సాయంత్రం మూడు గంటలు మొత్తం ఆరుగంటలు పూల్ దగ్గర ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలందరూ ఈత కొడుతున్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు రోజూ పూల్‌లోని వాటర్ ఫిల్టర్ చేస్తుంటారు. పిల్లల కోసం పెద్దలు, మహిళలు సైతం స్విమ్మింగ్ చేయిస్తున్నారు. నిత్యం అక్కడ ఉన్న సిబ్బంది స్వచ్ఛమైన వాటర్ నింపుతూ నీళ్లు కలుషితం కాకుండా చూస్తున్నారు.

నిరంతరం కొనసాగుతుంది



స్విమ్మింగ్ పూల్ నిర్వహణ నిరంతరాయంగా కొనసాగుతుంది. ఏమైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తప్ప స్విమ్మింగ్‌కు విరామం ఉండదు. పట్టణ ప్రజలు ఎప్పుడైనా స్విమ్మింగ్ చేయడానికి రావొచ్చు. పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా లైన్లు ఏర్పాటు చేశాం.

– రామచంద్రరావు, యువజన క్రీడల జిల్లా అధికారి

ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



చిన్నపిల్లల నుంచి పెద్దవారి దాకా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లయితే వారం నుంచి పది రోజులు స్విమ్మింగ్ నేర్చుకోవచ్చు. ప్రజలందరూ ముందుగా స్విమ్మింగ్ పూల్స్‌లోనే స్విమ్మింగ్ నేర్చుకొని మిగితా దగ్గర ప్రయత్నం చేయాలి. ఇక్కడ నాతోపాటు మరో నలుగురు సిబ్బంది స్విమ్మింగ్ నిర్వహణ చూస్తారు.

– శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్

వారంలో నేర్చుకున్నా..



ఈ సమ్మర్ సెలవుల్లో స్విమ్మింగ్ చేయడానికి వచ్చాను. వారం రోజుల్లో స్విమ్మింగ్ నేర్చుకున్నా. ఇప్పుడు నేను ఎక్కడైనా ఈత కొట్టగలను. నాతోపాటు మా తమ్ముడి కూడా స్విమ్మింగ్ నేర్చుకున్నాడు. ఇక్కడ మంచి వాతావరణం ఉంది. స్విమ్మింగ్ బాగా నేర్పిస్తున్నారు.

– జయంత్, విద్యార్థి, సంగారెడ్డి



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి

చంపుతామని బెదిరిస్తున్నారు

- వారసత్వంగా రావాల్సిన భూమి ఇవ్వడం లేదు
- ప్రజావాణిలో ఓ బాధితురాలి ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: అత్త మామల నుంచి నా భర్తకు వారసత్వంగా రావాల్సిన భూమి అడిగితే చంపుతామని నా భర్త అన్మాదమ్ముళ్లు బెదిరిస్తున్నారని ఓ బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం మెదక్‌లోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలస్వామి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తూప్రాన్ మండల హైదర్ గూడ గ్రామానికి చెందిన పిట్ల చంద్రకల ఫిర్యాదు చేస్తూ.. మా అత్తమామలకు ముగ్గురు సంతానమని తన భర్త అందరి కంటే చిన్నవాడు కాగా ఏడాది కిందట చనిపోయాడని తెలిపారు. తాత గారి వారసత్వంగా సక్రమించిన భూమిని మా మామ మరణించిన తర్వాత మా అత్త రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం భూమి 27 గుంటలు ఉండగా పెద్ద కుమారుడికి 6 గుంటలు, 2వ కుమారుడికి 8 గుంటలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు తెలిపారు. నా భర్త బతికున్నప్పుడు నా వాటా నాకు సరిగ్గా ఇస్తామని నమ్మించి, చనిపోయిన తర్వాత మోసగించారని వాపోయారు. వారసత్వంగా మాకు రావాల్సిన భూమిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ నన్ను చంపుతామని బెదిరిస్తూ భయ బ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్య తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు. అలాగే రామాయంపేట పట్టణానికి చెందిన మహమ్మద్ రఫీ తమకు అక్కన్నపేట గ్రామంలో కల ఫకీర్ సాబ్ దర్గా వద్ద ప్రతీ మూడేళ్లకు ఒకసారి వంతు ఉంటుందని తెలిపారు. ఈ నెల 23న సందల్ ఉందని కొంత మంది వ్యక్తులు పాత కక్షలు మనసులో పెట్టుకొని ఏమైనా చేస్తారని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ బాలస్వామి ఫిర్యాదుదారులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు చేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



జీషాన్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన ఎండి జహీరుద్దీన్ (21) సంగారెడ్డి ఎంఎన్ఆర్ కళాశాలలో ఫిజియోథెరపీ చదువుతున్నాడు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో పటాన్‌చెరు మండలం రుద్రారంలో ఫంక్షన్ ఉండటంతో స్నేహితులైన ముసాయిబ్, జీషాన్, జహీరుద్దీన్ బైక్‌పై ఫంక్షన్‌కు వచ్చి ఆదివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో జీషాన్ బైక్ నడుపుతుండగా పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డి వైపునకు వెళ్తున్న ఓ కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ కిందపడి అందులో నుంచి పెట్రోల్ బయటకు రావడంతో మంటలు రాగా జీషాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జహీరుద్దీన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.. తీవ్రంగా గాయాలకు గురైన జీషాన్ (19) ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జీషాన్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టకూటి కోసం వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు
- పంతుల్‌తండాలో అలుముకున్న విషాదం





చికిత్స పొందుతున్న స్వరూప, రాజు



కవిత(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. కూలీనాలీ చేసుకుంటూ బతుకు బండిని లాగుతున్నారు. పొట్టకూటి కోసం వేరే ప్రాంతానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు రూపంలో ఆ కుటుంబానికి విషాదం మిగిల్చింది. ఒకే కుటుంబానికి ముగ్గురు బైక్‌పై కూలీ పనులకు వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. అక్కన్నపేట మండలంలోని పంతుల్‌తండాలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. హుస్నాబాద్ డిపోకు చెందిన ప్రైవేటు అద్దె ఆర్టీసీ బస్సు హుస్నాబాద్ నుంచి అక్కన్నపేట మీదుగా జనగామ జిల్లాకు వెళ్తుంది. అలాగే పంతుల్‌తండా గ్రామం నుంచి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బైక్‌పై కూలీ పనులు చేసేందుకు వెళ్తున్నారు. పంతుల్ తండా క్రాసింగ్ వద్దకు రాగానే ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరంటోతు కవిత(35) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు కరంటోతు స్వరూప తలకు తీవ్ర గాయాలు కాగా, కరంటోతు రాజు కాలు విరిగి పలుచోట్ల స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్వరూప పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై తాండ్ర వివేక్ అన్నారు.

న్యాయం చేయాలని రోడ్డెక్కిన గ్రామస్తులు

ఈ ఘటనపై ఆగ్రహానికిలోనైన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలం వద్ద మృతదేహంతో దాదాపు 3 గంటలపాటు ఆందోళన చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఆర్టీసీ అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జేఈఈలో విద్యార్థుల ప్రతిభ



మారుతీ కుమార్

నర్సాపూర్: జేఈఈ అడ్వాన్స్‌లో తమ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారని స్థానిక ఎస్సీ గురుకుల ప్రతిభ కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. ఆయన సోమవారం ఫలితాలు వివరించారు. తమ కాలేజీకి చెందిన ఇ.మారుతీ కుమార్ 92మార్కులతో ఎస్సీ కమ్యూనిటీ విభాగంలో 391వ ర్యాంకు సాధించాడని చెప్పారు. తమ కాలేజీ నుంచి 17 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షలు రాయగా నలుగురు డైరెక్ట్ ఐఐటీ ర్యాంకులు, ఐదుగురు ప్రిపేరటరీ ర్యాంకులు సాధించి ఐఐటీ సీట్లు సాధించారని వివరించారు. మిగిలిన వారు ఆయా విభాగాల్లో పలు సీట్లు పొందే అవకాశం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రాంతీయ సమన్వయకర్త సంపత్‌కుమార్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, సీనియర్ అధ్యాపకులు వెంకటయ్య, సురేంద్ర, శ్రీనివాసులు అభినందించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

డీసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

హవేళిఘణాపూర్(మెదక్): ఈ విద్యా సంవత్సరంలో డీసెట్, డీపీఎస్ఈలో చేరేందుకు 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కేటగిరిలో ఇంటర్మీడియెట్‌లో కనీసం 50శాతం అలాగే ఎస్సీ, ఎస్టీలకు, దివ్యాంగులకు 45శాతం మార్కులు కలిగి, 17సంవత్సరాలు పూర్తి చేసుకొన్న వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లాలో ప్రైవేటు కళాశాలలో 300 సీట్లు ఖాళీగా ఉన్నాయని, జూలై 10న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శ్మశానవాటిక కబ్జాపై నిరసన



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న దళితులు

మెదక్ కలెక్టరేట్: శ్మశానవాటికను కొందరు వ్యక్తులు కబ్జా చేయాలని చూస్తున్నారని, దానిపై తమకు హక్కుపత్రం ఇవ్వాలని నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూరు గ్రామ దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్‌లో నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. కాగజ్ మద్దూర్‌లోని సర్వే నంబర్ 61లో ఉన్న శ్మశానం గ్రామ దళితులకు సంబంధించిందన్నారు. ఎలాంటి హక్కుపత్రం లేకపోవడంతో ధరణి వచ్చిన తర్వాత కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనేక మార్లు తహసీల్దార్, ఆర్డీవోకు విన్నవించినా ఫలితంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి హక్కుపత్రం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, కుమార్, యాదయ్య, కుమార్, నర్సింహులు, సలయ్య, శోభ, లచ్చయ్య, యశోద, లక్ష్మి, జ్యోతి, ఎల్లమ్మ, పోచయ్య, సైలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నీట్' మళ్లీ నిర్వహించాలి: ఎస్ఎఫ్ఐ



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ కలెక్టరేట్: నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ జూన్4న విడుదలైన నీట్ పరీక్ష ఫలితాలలో 67మందికి 720 మార్కులకు గానూ 720మార్కులతో ఆల్ ఇండియా మొదటి ర్యాంకు రావడంతోపాటు అందులో ఆరుగురు విద్యార్థులు ఒకే పరీక్ష కేంద్రంలో రాసిప వారే ఉండడం గమనార్హం. ఈ విషయంపై సుప్రీం కోర్టు రిటైర్డ్‌జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫామ్‌ల విక్రయాలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ డీఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

తట్టుకోలేక డెటాల్ తాగిన భార్య

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్ భరత్ నగర్‌లో నివాసం ఉంటున్న నరేందర్ రావు (35) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నరేందర్ రావు అతడి భార్య గీతాంజలి ఈనెల 9వ తేదీన కుటుంబ విషయంలో గొడవ పడ్డారు. దీంతో నరేందర్ రావు బెడ్ రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అది చూసిన భార్య గీతాంజలి డెటాల్ తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. విషయం తెలిసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గీతాంజలిని చికిత్స కోసం బీరంగూడలోని ఓ ఆస్పత్రికి తరలించారు. భార్యాభర్తలిద్దరూ గొడవ పడడంతో నరేందర్ రావు ఆత్మహత్య చేసుకున్నాడని, అది చూసి గీతాంజలి డెటాల్ తాగిందని మృతుడి సోదరి రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పల్లెల్లో ఎలక్ట్రిక్ బైక్‌ల జోరు

ఒక్కసారి చార్జి చేస్తే 60 నుంచి 80 కి.మీల ప్రయాణం

- రోజు రోజుకీ పెరుగుతున్న వాహనాల సంఖ్య
- ఆసక్తి చూపుతున్న రైతులు, మహిళలు

రోజురోజుకూ ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగం పెరిగిపోతుంది. పట్టణాల నుంచి పల్లెల వరకు వీటిని వినియోగిస్తున్నారు. రిజిస్ట్రేషన్, లైసెన్సు అవసరంలేని ఈ వాహనాలను గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా అవసరాలకు వాడుతున్నారు. ఒక యూనిట్ విద్యుత్ ఖర్చుతో 60 నుంచి 80 కిలో మీటర్ల వరకు ప్రయాణించొచ్చు.

– చేర్యాల(సిద్దిపేట)



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బైక్‌లు



మార్కెట్‌లోకి కొత్త కొత్త మోడళ్లు వస్తున్నాయి. వాటికి పోటీగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరిగిపోతుంది. రైతులు, కార్మికులు, మహిళలు, యువత, అధికారులు, వ్యాపారులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల తమ అభిరుచికి అనుగుణంగా నచ్చిన మోడళ్లను కొనుగోలు చేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్ వాహన ధరలు, ఇంధన ధరలు, మరమ్మతుల ఖర్చుల కారణంగానే వినియోగదారులు ఎలక్ట్రిక్ బైక్‌ల గురించి తెలుసుకొని కొనుగోలు చేస్తున్నారు. రైతులు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడేలా పలు కంపెనీలు రకరకాలుగా వీటిని తయారు చేస్తున్నాయి. హైదరాబాద్, హరియాణా, గుజరాత్, పుణె తదితర ప్రాంతాల నుంచి విక్రయదారులు వీటిని దిగుమతి చేసుకొని అమ్ముతున్నారు. వీటి ధర రూ.65 వేల నుంచి లక్షకు పైగా ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

బరువు తక్కువగా..

పట్టణాలు, పల్లెల రోడ్లపై తిరగడానికి చాలా సౌకర్యంగా ఉండడమే కాక మార్కెట్, దుకాణాలు, ఉద్యోగాలకు వెళ్లి రావడానికి, పిల్లలను బడులకు పంపడానికి, రైతులు పొలాలకు ఎరువులు తరలించడానికి, కూరగాయలు, పాలు అమ్మడానికి, సులువుగా ఉంటుంది. బరువు తక్కువగా ఉండటం వల్ల నడపడంలో ఇబ్బంది ఉండదు.

4 నుంచి 6 గంటల్లో ఫుల్ చార్జ్..

వాహన బ్యాటరీ ఫుల్ చార్జ్ కావడానికి బ్యాటరీ మోడల్‌ని బట్టి 4 నుంచి 6 గంటల సమయం పడుతుంది. బ్యాటరీల్లో గ్రాఫైన్, లిథియం అయాన్ బ్యాటరీ మోడళ్లు ఉంటాయి. గ్రాఫైన్ బ్యాటరీ ఎక్కువ సమయం చార్జ్ అవుతుంది తక్కువ దూరం ప్రయాణిస్తుంది. లిథియం అయాన్ బ్యాటరీ తక్కువ సమయంలో చార్జ్ అవుతుంది ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది. ఈ రెండింటిలో గ్రాఫైన్ బ్యాటరీ వాహన ఖరీదు తక్కువ, లిథియం అయాన్ బ్యాటరీ వాహన ధర ఎక్కువ. ఏదైనా ఒక్క యూనిట్ చార్జ్‌తో 60 నుంచి 80 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చు. వీటిని నిత్యం 50 కిలో మీటర్లలోపు తిరిగే రైతులు, మహిళలు, ఉద్యోగులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వీటి వాడకానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రతీ 50 కిలో మీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే మరింత వాహనాల సంఖ్య పెరిగే అవకాశముంది.

లైసెన్స్ అవసరం లేదు

ఈ వాహనాలు గంటకు 30 కిలో మీటర్ల లోపు వేగంతో వెళ్తాయి. కనుక వీటిని నడిపే వారికి లైసెన్సు అవసరం లేదు. లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ధ్రువీకరణ పత్రాలు లేకుండా ప్రయాణించొచ్చు. ఇందులో హైస్పీడ్ వాహనాలుంటాయి వాటికి రిజిస్ట్రేషన్, లైసెన్సు తప్పనిసరి. వీటి నిర్వహణ ఖర్చులు చాలా తక్కువ ఉండటంతో ఆసక్తి చూపుతున్నారు.


రైతులు, మహిళా ఉద్యోగులు..



వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, మహిళలు, ఉద్యోగులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ నడిపేందుకు సౌకర్యవంతంగా ఉంటాయి. వాతావరణ కాలుష్యం ఉండదు. సీజన్‌లో నెలకి 10కి పైగా అమ్ముతాం. ఇప్పటి వరకు సుమారు 200 వరకు విక్రయించాం. ప్రజల్లో వీటిపై అవగాహన పెరిగింది. పెట్రోల్ వాహనాల కంటే ఇవే ఎక్కువ కొంటున్నారు.

–గూడ నాగేశ్వర్‌రెడ్డి, రాళ్లబండి రవీందర్, నిర్వాహకులు

పొలం పనులకు తీసుకెళ్తున్నా..



పొలం పనులకు చక్కగా ఉపయోగపడుతోంది. రెండు యూరియా బస్తాలు, గడ్డి మోపు ఒకేసారి మోస్తోంది. మట్టి రోడ్డుపై ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్తున్నాను. గతంలో రోజుకు పెట్రోల్‌కి రూ.50 నుంచి రూ.100 అయ్యేది. ప్రస్తుతం రూ.5 లోపే ఖర్చవుతోంది. చాలా మందికి కొనుక్కోమని సూచిస్తున్నాను.

–దయ్యాల ఆంజనేయులు, రైతు, అయినాపూర్